క్లుప్తంగా

తోటాడ రామాలయ కమిటీ ఎంపిక


నూతన అధ్యక్షుడు నాగేశ్వరరావు

మునగపాక: మండలంలోని తోటాడ రామాలయ కమిటీ అధ్యక్షుడిగా పాలమరశెట్టి నాగేశ్వరరావు ఎంపికయ్యారు. గురువారం స్థానిక రామాలయం ఆవరణలో నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా కొయిలాడ జగదీష్, కోశాధికారిగా కోరిబిల్లి అచ్చియ్యనాయుడులతో పాటు కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తుల సహాయ, సహకారాలతో రామాలయం ప్రతిష్ఠ పెంచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దలు ఆళ్ల మురళి, దొడ్డి బాలాజీ, బుద్ద రామారావు, భుజంగరావు, గణపతి, రమేష్, ప్రసాద్, బాపు నాయుడు, పాలమరశెట్టి ప్రసాద్, బొడ్డేడ బాబ్జీ పాల్గొన్నారు.

కొత్త అమావాస్య వేడుకలకు ఏర్పాట్లు


నూకాంబిక అమ్మవారు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి జగ్జీవన్‌రామ్ కాలనీలో పురాతన నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 200 సంవత్సరాల క్రితం ఇక్కడ నూకాంబిక అమ్మవారు వెలిశారు. అప్పటి నుంచి ఏటా కొత్త అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో నెలరోజుల పాటు వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా నూకాంబిక అమ్మవారికి పేరుంది. దీంతో కొత్త అమావాస్య వేడుకలను ఈ పర్యాయం ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎస్.రాయవరం: కొత్త అమావాస్య జాతరతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. మండలంలో తిమ్మాపురం, చినగుమ్ములూరు, కోనవానిపాలెం, గుర్రాజుపేట, సర్వసిద్ధి, నీలాద్రిపురం, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో ఉత్సవం నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వారం రోజులుగా అమ్మవారి గరగల ఊరేగింపు పురవీధుల్లో చేస్తూ సందడి చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో యువకులు కోలాటం, నేల డ్యాన్సుల మధ్య గరగల ఊరేగింపు సందడి చేస్తున్నారు. శనివారం నిర్వహించే కొత్త అమావాస్య జాతర సందర్భంగా పురవీధుల్లో విద్యుద్దీపాలంకరణలు చేసి వీధులన్నీ ముస్తాబు చేస్తున్నారు.

నేడు వేంపాడు నూకాలమ్మ జాతర


వేంపాడు నూకాలమ్మ ఆలయం

నక్కపల్లి: మండలంలో వేంపాడు నూకాలమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరగనుంది. దీనికి సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయం వద్ద భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం, గునిపూడి, కొత్తూరు, దొడ్డిగల్లు తదితర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవార్లూ జాగరణ జరిగింది.

మౌలిక వసతులకు ఎన్టీపీసీ కృషి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కృషి చేస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ అన్నారు. సింహాద్రి హెచ్‌వోపీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్యా, నైపుణ్యాభివృద్ధి పెంపొందించేలా సంస్థ చర్యలు తీసుకుంటోందన్నారు. సంస్థ ద్వారా పరవాడ మండలంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. సంస్థ ఏజీఎం, సర్పంచులు పాల్గొన్నారు.

వరాలిచ్చే వనదేవత

- గూడుపమ్మ ఆలయానికి భక్తుల క్యూ
- దట్టమైన అడవులు, పచ్చని కొండల మధ్య వెలిసిన అమ్మవారు
- ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న రేబాక
- వేసవిలో ఆహ్లాదకర వాతావరణం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


రేబాకలో పచ్చని వనాల మధ్య ఉన్న గూడుపమ్మ తల్లి ఆలయం

నక్కపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. వరాలిచ్చే వనదేవతగా.. భక్తుల ఇలవేల్పుగా.. గూడుపమ్మ ఆలయం వెలుగొందుతోంది. రేబాకలో వెలసిన అమ్మవారు కృపతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఇక్కడ దట్టమైన అడవులు, పచ్చని కొండల మధ్య శక్తిపీఠంగా కొలువుదీరిన అమ్మవారు దర్శనానికి భక్తులు క్యూ కడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ప్రాంతం పర్యాటకంగానూ ఆకట్టుకుంటోంది.

నక్కపల్లి మండలం రేబాకలో దాదాపు 300 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని సుమారు కోటి రూపాయలు వెచ్చించి ఇటీవల పునర్నిర్మించి శక్తి పీఠంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటే అనుకున్న పనులు పూర్తవుతాయనేది ఈ ప్రాంత ప్రజల నమ్మకం. దాంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

రెండేళ్లకోమారు జాతర..

వనదేవతగా గూడుపమ్మతల్లి అమ్మవారు రేబాక గ్రామ శివారులో పచ్చని కొండల మధ్య కొలువుతీరారు. ప్రతి రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మవారి పండుగ(జాతర)ను అంగరంగ వైభంగా నిర్వహిస్తారు. మెరక గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా ఉన్న గూడుపమ్మ తల్లిని ప్రతి మంగళ, ఆదివారాల్లో విశేషంగా భక్తులు తరలివచ్చి దర్శించుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. కాకినాడ జిల్లా తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ మాదిరిగానే భక్తులు మంగళ, గురు, శుక్ర, ఆదివారాల్లో కుటుంబాలతో వచ్చి మేకపోతులను, కోళ్లను బలిస్తూ పూజాది కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కులను సమర్పించుకుంటారు. కార్తీకమాసంలో అయితే ఆలయం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. పిక్నిక్‌లకు వనసమారాధనలకు కుటుంబాలతో సహా వచ్చి రోజంతా గడిపి అమ్మవారిని దర్శించుకుని సామూహిక భోజనాలు చేసి తిరుగు ప్రయాణమవుతారు. చుట్టూ ఎత్తయిన కొండ, దట్టమైన అడవుల్లో పచ్చన చెట్లు మధ్య మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న వనదేవత ఆలయం పర్యాటక ప్రాంతంగా మరీ గుర్తింపు పొందింది.


ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకుంటున్న భక్తులు

కొలువుదీరిన సర్వదేవతలు..

తుని పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రేబాక గూడుపమ్మతల్లి ఆలయానికి ప్రతి పది నిమిషాలకు ఆటోలు ఉంటాయి. ఉద్దండపురం జంక్షన్‌లో బస్సుదిగిన వారు అక్కడ ఉన్న ఆటోస్టాండ్‌లో ఉన్న ఆటోల ద్వారా అమ్మవారి ఆలయానికి చేరుకోవచ్చు. వేసవి కాలం కావడంతో ఆహ్లాదకరంగా ఉంటూ చల్లదనంతోపాటు భక్తిభావం పెంపొందించే గూడుపమ్మతల్లి ఆలయానికి పది రోజుల నుంచి పర్యాటకులు, భక్తుల తాకిడి పెరిగింది. ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా ప్రధాన గర్భాలయం చుట్టూ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవుడు, వనదేవత, నాగదేవత, సరస్వతి దేవి మందిరం, అష్టలక్ష్మీదేవతల మందిరం, నూటొక్క దేవతల రూపాలు, రాహు, కేతు విగ్రహాలు గ్రామ దేవతల విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతో సర్వదేవతలు కొలువుదీరిన ఆలయానికి వచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో మునిగి తేలుతున్నారు. ఆదివారం ఆలయానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబాలతో సహా తరలివచ్చారు. ఇక్కడే వంటావార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమవుతుంటారు.

ప్రజలను కాపాడుతున్న అమ్మవారు



గూడుపమ్మతల్లి ఎంతో మహిమ గలది. అమ్మవారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయనే నమ్మకం ఉంది. అందుకే కుటుంబాలతో సహా ఈరోజు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నాం. పచ్చని వాతావరణంలో దట్టమైన అడవుల మధ్య వనదేవతగా అమ్మవారు ప్రజలను కాపాడుతున్నారు.

– ఎం. జ్యోతి, ఎలమంచిలి

ఏదో తెలియని అనుభూతి



గూడుపమ్మతల్లి గురించి తెలుసుకుని ఇక్కడకు వచ్చాం. ఇటీవల ఆలయాన్ని నూతనంగా నిర్మించడంతో చాలా మంది భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి ఆలయంతోపాటు చుట్టూ చాలా ఉపాలయాలు ఉన్నాయి. అమ్మవారిని దర్శించుకున్న వెంటనే ఏదో తెలియని అనుభూతి కలిగింది. మనసు కుదుటపడింది. మారుమూల ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రసాద వితరణ చేయడం గొప్ప విషయం.

– గెంజి లక్ష్మి, ములకపాలపల్లి ఎలమంచిలి

పిఠాపురం నుంచి వచ్చాం



మాకు తెలిసిన బంధువుల ద్వారా గూడుపమ్మతల్లి ఆలయం గురించి విన్నాం. ఇక్కడకు వచ్చి దర్శించుకోవాలనిపించి పిఠాపురం నుంచి వచ్చాం. నిజంగా అమ్మవారి విగ్రహం చూడటానికి రెండు కళ్లు చాలవు. ఆలయ ప్రాంగణం చాలా ఆహ్లాదకరంగా ఉంది. చుట్టూ ఎత్తయిన కొండలు, పచ్చని చెట్ల మధ్య ఉండటం వేసవి కాలంలో సేదతీరేందుకు, కార్తీకమాసంలో పిక్నిక్‌లకు చాలా బాగుంటుంది. మాతోపాటు చాలా మంది కుటుంబాలతో సహా వచ్చి ఇక్కడే వంట చేసుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

– బి. దేవి, పిఠాపురం

భక్తుల సహకారంతో నిత్యాన్నదానం

ఆలయంలో గ్రామస్తులు, భక్తుల సహకారంతో నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. కోటి రూపాయలతో ఆలయాన్ని పునర్నిర్మించాం. అమ్మవారి అనుగ్రహం ఉంటే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది.

– శ్రీహరి రాజు, ధర్మకర్త

కార్పెంటర్ల ర్యాలీ

పాయకరావుపేట: కార్పెంటర్స్ డే సందర్భంగా పట్టణంలో కార్పెంటర్లు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు కార్పెంటర్స్ ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు కుసోజు శ్రీను, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామోజు నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డీవీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుందని ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

సెకీ ఒప్పందం రద్దు చేయాలి

నర్సీపట్నం: సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం ఏపీఈపీడీసీఎల్ (ఇండోర్) సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసుకున్న చీకటి సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఒప్పందం రద్దు చేయమని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందూజాతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీలు విధించిందన్నారు. విద్యుత్ భారంపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని రాజు పిలుపునిచ్చారు.

పోలవరం కాలువ రైతులు మోసాలకు గురికావొద్దు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, గైతుల పాలెం గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ భూ సేకరణకు సంబంధించి రైతులు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు కోరారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ కోసం రాజమహేంద్రవరం ఎడమ కాలువ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఆధ్వర్యంలో భూసేకరణ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను సమర్పించడానికి ఫోన్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు రైతులను కోరుతున్నారన్నారు. ఓటీపీ, మరే ఇతర వ్యక్తిగత వివరాలుగాని రాజమహేంద్రవరం కార్యాలయం కోరడం లేదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి మోసపోవద్దని కోరారు.

నేటికి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

- ఈవోపీఆర్డీ అస్వస్థతతో నిలిచిన ఉప ఎన్నిక


వార్డు మెంబర్లను ఇళ్లకు చేరవేస్తున్న పోలీసులు


ఇరువర్గాలు వార్డు మెంబర్ల కోసం వివాదం


ఈవోపీఆర్డీకి చికిత్స అందజేస్తున్న వైద్యాధికారి

అచ్యుతాపురం రూరల్: వెదురువాడ పంచాయతీలో ఉప సర్పంచ్ ఉప ఎన్నిక గురువారం హోరా హోరాగా జరిగింది. ఇంతలో ఈవోపీఆర్డీ అస్వస్థతకు గురవడంతో శుక్రవారానికి వాయిదా పడింది. వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు ఏడుగురు, కూటమి వార్డు మెంబర్లు ముగ్గురు ఉండటంతో అధికార పార్టీ బలంతో ప్రతిపక్ష వార్డు మెంబర్లను ఎరవేసే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, జెడ్పీటీసీ లాలం రాము, కో–జెడ్పీటీసీ నర్మాల కుమార్, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనువాసరాజు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగి చురుగ్గా వ్యవహరించడంతో తిరిగి వార్డు మెంబర్లు ఎన్నికల గదిలోకి వెళ్లారు. ఈ క్రమంలో కార్యాలయంలో గట్టిగా కేకలు వేయడంతో ఈవోపీఆర్డీ శ్రీరామమూర్తి నాయుడు ఆరోగ్యం సహకరించకపోవడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత చికిత్స అందజేశారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు శుక్రవారానికి వాయిదా వేశామని పంచాయతీ సెక్రటరీ తెలిపారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్, ఎస్‌ఐలు సుధాకర్, వెంకటరావు సిబ్బంది పర్యవేక్షణలో వార్డు మెంబర్లను వారి ఇళ్లకు రెండు టాటా మేజిక్ వాహనాల్లో క్షేమంగా చేరవేశారు.

మునగపాక ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

- నాలుగు పంచాయతీల ఉప ఎన్నికలు ప్రశాంతం


తోటాడ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన హైమను సత్కరిస్తున్న సర్పంచ్ మంగవేణి, సభ్యులు

మునగపాక : మండలంలోని ఐదు పంచాయతీలకు గురువారం ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా వాటిలో మునగపాక తప్ప ఇతర పంచాయతీలకు ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. మునగపాక ఉప సర్పంచ్‌కు సంబందించి సభ్యులు ఎవరూ ఎన్నికకు హాజరుకాకపోవడంతో ఎన్నికల అధికారి సోమరాజు శుక్రవారం నాటికి వాయిదా వేశారు. తోటాడ ఉప సర్పంచ్‌గా కోట్ల హేమ, నారాయుడు పాలెం ఉప సర్పంచ్‌గా కొయ్య నల్లయ్య, రాజుపేట ఉప సర్పంచ్‌గా జెర్రిపోతుల కనక మహలక్ష్మి, నాగులాపల్లి ఉప సర్పంచ్‌గా గోసాల గోవిందరాజులు ఎన్నికయ్యారని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. కాగా తోటాడ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కోట్ల హేమను సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఇతర పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సామూహిక నీటి కుండీల నిర్మాణానికి చర్యలు


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు

నాతవరం: జిల్లావ్యాప్తంగా వేసవిలో పశువులకు తాగునీటి సమస్య లేకుండా ఉపాధి హామీ పథకంలో సామూహిక నీటి కుండీలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. శృంగవరంలో పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పాడి రైతులతో సమావేశమయ్యారు. పాడి ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు రాయితీపై పశుగ్రాసం విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంచేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నీటి కుండీలు నిర్మించేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో స్థలం చూపిస్తే ఉపాధి హామీ పథకం నిధులతో వెంటనే నిర్మిస్తామన్నారు. పాయకరావుపేట వెటర్నరీ విభాగం ఏడీ శ్రీనివాసరావు, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పశువైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగ్గని చింతపండు ధర


అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ: మండలంలోని కోనాం సంతలో ఈ గురువారం కూడా చింత పండు ధర తగ్గలేదు. కోనాం సంతకు హుకుంపేట, అనంతగిరి, దేవరాపల్లి, పాడేరు మండలాలకు చెందిన గిరి గ్రామాల చింత పండు భారీగా వస్తుంది. ఈ చింత పండుకు మంచి గిరాకీ ఉండడంతో విశాఖ, అనకాపల్లి, చోడవరంల నుంచి వ్యాపారులు, వినియోగదారులు తెల్లవారు జామునే కోనాం చేరుకుని చింతపండు కొనుగోలు చెస్తుంటారు. ఈ వారం సంతకు భారీ స్థాయిలో చింతపండు వచ్చినా ధర మాత్రం గత వారం కంటే ఎక్కువ పలికింది. 30 కిలోల కావిడి చింత పండు రూ. 1800 నుంచి రూ. 2 వేల వరకు పలికింది.

విద్యుత్ చార్జీల పెంపు తగదు


ఎలక్ట్రికల్ ఏఈ శంకరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: రాష్ట్రంలో విద్యుత్ ట్రూ అప్ చార్జీల పెంపును ఉపసంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి విద్యుత్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీపీఎం నేత డి. వెంకన్న మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి రూ. 9412 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేయాలని ఈఆర్‌సీ ఆదేశించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ. 7912 కోట్లు భారం మోపేందుకు రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పైడితల్లి, సన్యాశి, సోములు తదితర సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ


దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: మేడివాడ హైస్కూల్లో మండలానికి చెందిన 14 మంది దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహలక్ష్మి నాయుడు మాట్లాడుతూ మండలంలో గతంలో 70 మంది దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసులు అందజేశామన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఈ బస్ పాసుల ద్వారా 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు.

మేజర్ గ్రామ ఉప సర్పంచ్ పదవులు
వైఎస్సార్‌సీపీ కైవసం


మాడుగుల ఉప సర్పంచ్‌గా వరహాలుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి


గోవిందరాజులును అభినందిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలో నాలుగు గ్రామ ఉప సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి, మూడు ఉప సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. కింతలి ఉప సర్పంచ్ పదవి అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. మేజర్ గ్రామ పంచాయతీ మాడుగుల ఉప సర్పంచ్ పదవికి 16వ వార్డు సభ్యుడు జవ్వాది వరహాలును పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామకపు పత్రాన్ని ప్రిసైడింగ్ అధికారి రమణి అందజేశారు. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ యడ్ల కళావతితో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందిన వారు. ఒక వార్డు సభ్యుడు వేమన గణేశ్ ఎన్నికకు ఆలస్యంగా వచ్చారు. రెండవ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా సూరిశెట్టి గోవిందరాజులును పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాగా, గోవిందరాజులుకు దేశం, వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు మద్దతు పలికారు. గోవిందరాజులును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, మద్దాల వెంకట సత్యనారాయణ, కాళ్ల రాము, సూరిశెట్టి అచ్చిమినాయుడు, శంకర్రావు తదితరులు అభినందించారు. పోతనపూడి ఉప సర్పంచ్‌గా మైచర్ల నారాయణరావును వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన


సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ ఎదుట నిరసనలో కార్మికులు

పరవాడ: ఫార్మాసిటీలోని సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుట సిటు ఆధ్వర్యంలో గురువారం కార్మికులు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదం లేకుండా, పారిశ్రామిక చట్టాలను ఉల్లంఘించి పరిశ్రమను మూసివేసి కార్మికుల బకాయి వేతనాలను చెల్లించకుండా మొండి వైఖరి అవలంబించడం సరికాదన్నారు. కార్మికులకు చట్టపరంగా రావాల్సిన వేతనాలు, గ్రాట్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ లేబర్ కమిషనర్ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలన్నారు. అంతకు ముందు కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేలా పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మహేష్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.